# చీమలు పెట్టిన పుట్టలు

**కథానిక**

వై. వి. ఎస్. ఎస్. ఎన్. మూర్తి

గూడెం అంతా తట్టుడికి పోయినట్టు ఉడికిపోతోంది. ఎవరింట్లోనూ పొయ్యి రాజయ్య లేదు. ఎవరికీ కాళ్ళు నిలవడం లేదు. "ఏం చేయడం? ఏం చేయడం?" అంటున్నారే గాని, ఏం చేయడమో ఎవరికీ తోచడం లేదు. తాత తండ్రుల కాలం నుండి ఉంటున్న చోటు, ఎన్నాళ్ళో శ్రమపడి ఎన్నో కష్టాలు పడి కట్టుకున్న కొంపల్ని అర్థంతరంగా వదిలి పెట్టి ఎక్కడికి పోవడమో ఎవరికీ అంతు బట్టలేదు. కుర్రాళ్ళు మాత్రం ఉద్రేకపడిపోతున్నారు. "మమ్మల్ని కాళీ చేయించడానికి ఎవడొస్తాడో చూస్తాం! ఈవాళ వాళ్ళ తలలో, మా తలలో ఎగిరిపోవాలి" అంటున్నారు వాళ్ళు.

పట్నానికి ఒక మైలు దూరంలో వెలివేయబడ్డట్టున్న గూడెం ప్రజలకి అకస్మాత్తుగా ఆ స్థలం ఖాళీ చేసి పొమ్మని నోటీసు జారీచేసింది ప్రభుత్వం. ఎందుకంటే ఆ స్థలం ఒక ఫ్యాక్టరీ నిర్మాణం కోసం ఎవరో ఒక గొప్ప వ్యక్తికి దాఖలు పరచబడ్డదట. 15 రోజుల్లో స్థలం ఖాళీ చేయకపోతే, ఇళ్ళన్నీ పీకేస్తామన్న వార్నింగు కూడా ఆ నోటీసు ద్వారా వచ్చింది. నోటీసు వచ్చినప్పటి నుండి ఎవరికీ కాళ్ళాడ్డం లేదు. ఏదో పెద్ద ఆపద వచ్చి నెత్తిమీద పడినట్లు ఉక్కిరి బిక్కిరి అయి పోతున్నారు. నిజం చెప్పవలసి వస్తే, వాళ్ళు ఆ స్థలం ఎందుకు ఖాళీ చేయాలో వాళ్ళకే తెలీదు. "ఎవరో ఫేక్టరీ కట్టుకుంటే మమ్మల్ని ఇళ్ళు ఖాళీ చేయమనడం ఏం న్యాయం?" అన్నది వాళ్ళ ప్రశ్న. ఎప్పటి నుండో అక్కడే కొంప గూడూ కట్టుకొని పిల్లా-పిచ్చికతో బ్రతుకుతున్నారు వాళ్ళు. ఈ వాళ అది మీది కాదు పొండి అంటే ఎక్కడికి పోవాలా అన్నదే బెంగ వాళ్ళకు. అదే దిగులు. ఈ సమస్య గుప్పిటిలో నుండి ఎలా బయట పడ్డమా అని తల బ్రద్దలు కొట్టుకుంటున్నారు.

"ఎందుకొరే! యిలా మనం తల బాదుకోడం? మన సత్తింగారి దగ్గరకు పోయి సెప్పుకుందాం. ఆయన గోరే ఏదో దారి సూపిత్తాడు" అన్నాడు ముసలయ్య. ముసలయ్య పేరుకే కాదు వయస్సులో కూడ గూడెంలో అందరికంటే పెద్దే.

కాని కుర్రకారుకా మాటేం నచ్చలేదు. "సత్తింగార్ని నమ్ముకొంటే కొంప నట్టేట్లో కట్టుకోడమే!" అన్నాడు ముసలయ్య మనుమడు చిన్న ముసలయ్య. "మొన్నటికి మొన్న మన కూలి బత్తెం కోసం చేసిన సమ్మెలో రైతులకే వంత పాడాడు గాదా! ఈనాడు మాత్రం మనకేం వొరగ బెడతాడు?" అన్నాడు ముత్యాలు ఆవేశంగా.

"ఆయన మాత్రం ఏం జేత్తాడు, మనలో మనకే కట్టులేక పోయె" అన్నాడు ముసలయ్య.

"ఒరే తాత! నువ్వలా అంటువుండు!

మన బతుకులు ఇలా రోజు రోజుకూ దిగజారడమే గాని యెదగవు. అళ్ళు సెఱుకు, గింజలు నాయంగా అమ్మి నాభాలు గడిస్తున్నారేటి ? ఈ పెద్దోళ్ళంతా ఇంతే. ఆళ్ళకి ఈ పెఱుత్వం కావలా ! ఆళ్ళకి నచ్చనోళ్ళు ఎదుట ఉండకూడదు. ఈయేళ మీరీ సోటులో ఉండగోడదు; రేపు మీరీ భూమి మీదే మనుష్యుల్లా బతక్కూడదు అని నోటీ సిత్తారు. మన సత్తింలాటోళ్ళు ఓటు యేసే దాక మన మాట, ఆపైన పైవోళ్ళ పాట. ఆళ్ళను నమ్ముకోడం కంటే కొంపలికి అగ్గి పెట్టుకొని అందులో పడి సచ్చిపోడం మంచిది'' అన్నాడుచిన్న ముసలయ్య ఆవేశంగా.

''ఒరేయ్ ముసిలిగా ! వూరికే ఆవేశ పడిపోతే యేటి లాభం ? ముందు జర గాల్సిన కతేటో సూడండి!'' అన్నాడు చిన్నయ్య.

''ఏటి సేయ గలం ! ముసలయ్య తాత సెప్పినట్టు సత్తిం గారికి సెప్పి, ఆ పైన ఆయనేటి సెయ్యమంటే అదే సేద్దాం'' అన్నారు తలలు నెరిసిన పెద్దలంతా.

''సరే!'' అంటూ లేచారు అందరూ.

* * *

''బావూ! ఇప్పటికి ముప్పయేళ్ళ క్రితం మా గూడెం సరిగ్గా మన సెఱుకు పేటరీ వుండే అక్కడుండేది. ఆనాడు ఆ బావు లంతా వచ్చి అక్కడ సెఱుకు పేటరీ కట్టిత్తాం. మీకు సాలు పొడు వునా కూలి పని వుంటుంది. ఈ తలం పేటరీకి మంచిది. ఏటి పక్కనే పేటరీ ఉండడం మంచిది. మీరు ప్రతీ యేడు వరదలవల్ల ఇబ్బంది పడుతున్నారు. మా మాట యిని మీరు వూరికి దక్షినాన తమ్మల సెరువు కాడ ఇళ్ళు కట్టు కొండి. ఆ తలం అంతా మీకే వుసితంగా యిత్తాం. ఆ తలం పైన హక్కు మీకే ఉంటుంది. ఇళ్ళు యేసుకో డానికి తలొక వందా ఇత్తాం!'' అని సెప్పినారు. పని మీద ఆశ చేత ఇళ్ళన్నీ కాళీ చేసి అళ్ళకి ఇచ్చేసినాం. ఊరికి దూరంగా తుమ్మల సెరువు కాడకు పోయినాం. అక్కడ ఎక్కడ చూసినా తుమ్మ మొద్దులూ – గాతలూ – నీరు – రాళ్ళు రప్పలే. పురుగు – పుట్ర సెప్ప పని లేదు. మాలో కొంత మంది పురుగూ – పుట్రకు బలియిపో నారు. గాతలన్నీ పూడ్చి, సక్కగా సదును చేసి ఇళ్ళు కట్టుకున్నాం. ఆ ళ్ళిచ్చిన వందే మూల ? నా నాకష్టాలు పడి సెమట అంతా కార్చి ఇళ్ళు యేసు కున్నాం. ఆళ్ళన్నట్లుగానే పేటరీ పెట్టి నారు. మాలో కొంత మందికి పనిచ్చి నారు. ఏదో గుడ్డిలో మెల్ల అనుకున్నాం. కొందరం పేటరీ పనిలోకి పోయోళ్ళం కొందరం రైతువారీ పని లోనికి పోయోళ్ళం. నాలు గైదేళ్ళు పోనాయి. ఎవరో పట్నం బాబులు వచ్చినారు. సంఘం అన్నారు. సమ్మె లన్నారు. కూలీ పెంచమని సమ్మె సేయించినారు. పేటరీ మూత పడ్డది. పేటరీలో పనిచేసే వోళ్ళు వీధిలో పడ్డారు. పనీ – పాట లేదు. గంజికి ముఖం వాసి పోనారు. అల్లాడి దేశాల పాలయి పోనారు కొందరు. కొన్నాళ్ళు పోయాక లారీల నిండా మనుష్యులు దిగారు పొన్నూరి నుండి. పేటరీ తలుపులు తీసినారు. కాని పనులు మాకియ్య లేదు. ఏం అని అడిగి నోడు లేడు మాతరపున. సమ్మె చేయించిన పట్నం బాబులు రాలేదు.

అయినా ఎలాగో మా బతుకులు మాం బతుకుతూ వస్తున్నాం. ఆ నాడు గవర్నమెంటోడు మాకిచ్చిన తలాన్ని మానుండి లాక్కొని మమ్మల్ని మల్లా దేశాల పాలు సేయాలని సూత్తున్నారీ పెద్దోళ్ళు. బావూ! నాయం నువ్వే సెప్పు? మమ్మల్ని నువ్వే కాపాడాల. నువ్వేటి సెయ్యమంటే అదే సేత్తాం" అన్నాడు ముసలయ్య.

అంతా జాగ్రత్తగా విన్న యం. ఎల్. ఏ. సత్యం "ముసలయ్యా! ఆనాడు ప్రభుత్వం మీ పేర స్థలం కేటాయించినట్లు వ్రాసి యిచ్చిన పత్రాలు ఏమయినా ఉన్నాయా" అన్నాడు.

"అలాటియ్యి యేటి లేవు!" అన్నాడు ముసలయ్య.

"అయితే చాలా కష్టమే!" అన్నాడు సత్యం.

"బాబ్బాబూ! నువ్వే కాపాడాల."

"ఎన్నికల్లో మా ఓట్లన్నీ మీకే వేసినాం. మా బాగోగులన్నీ మీరే సూడాల" అన్నాడు చిన్నముసలయ్య.

"కాదని నేను అన్నానా! అలాగే చూస్తాను. హైదరాబాదు వెళ్ళి ముఖ్యమంత్రి గారితో మాట్లాడి వ్యవహారం సెటిల్ చేసుకు వస్తాను. కాని హైదరాబాదు పోయి వచ్చేందుకు ఖర్చులు అవుతాయి కదా!" అన్నాడు సత్యం.

"బాబూ! కరుసులు కోసం జంకం. ఏపాటి కరుసు అవుతాదో సెప్పండి, తెచ్చి ఇత్తాం!" అన్నాడు ముసలయ్య

"సుమారు 200 అవుతాయి."

"సరే బాబూ! తెచ్చి ఇత్తాం!" అన్నారు అంతా.

గూడెం ఇళ్ళ వాళ్ళందరూ చందాలు పోగుచేసి రెండొందలు సత్యం చేతికి ఇచ్చారు. సత్యం అవేళే హైదరాబాద్ వెళ్ళిపోయాడు.

సత్యం హైదరాబాదు వెళ్ళి 12 రోజుల అయింది. అటునుండి జాడ - జవాబు లేదు. గూడెం ప్రజలంతా సత్యం రాకకోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఒక రోజు తెల్లవారు ఝామున లారీల నిండా మనుషులు దిగారు. బుల్‌డోజర్లు దిగాయి. తెల్లవారే టప్పటికి గూడెం మట్టిలో కల్సిపోయింది. వాళ్ళ సామానులు చిందర వందరగా, చెల్లా - చెదురుగా పడి రోడ్డుపాలయిపోయాయి.

పిల్లా మేక, పెద్దా - చిన్నా, ముసలీ ముతకా అందరూ కట్టుగుడ్డలతో మిగిలిపోయారు. చిందర వందరగా పడివున్న సామాన్లు మూటగట్టుకొని, నెత్తిమీద పెట్టుకొని మరొక చోట గూడు కట్టుకోను బయలు దేరారు గుంపులు గుంపులుగా. మమత చావని ముసలి వాళ్ళు కూలిపోయి మట్టిలో కలిసిన ఇళ్ళ చుట్టూ కన్నీళ్ళు పెట్టుకొని పిచ్చిగా తిరుగు తున్నారు.

ఇంతలో దుమ్ము లేపుకుంటూ పట్నం వైపు రయ్యిన వస్తున్న కారు వైపు పిల్లలు వింతగా చూస్తున్నారు. కొత్త ఎంబాసిడర్ కారు దుమ్ము రేపుకుంటూ వాళ్ళ మధ్యనుండి దూసుకు పోయింది. గాలితో పాటు పైకి లేచిన దుమ్ము వాళ్ళ ముఖాలపై కోటా కొట్టినట్లు పడింది.

కారులో యం. ఎల్. ఏ. సత్యం కాళ్లు నిగడదన్ని, సిగరెట్టు దమ్ము లాగుతూ, చూసీ చూడనట్టు చూస్తుండం ఎవరూ చూడలేదు.